# కొయ్యగుర్రాలు

సాయంత్రం చాలామంది మిత్రులం హోటల్లో కలిశాము. సందర్భం, నేను తీసిన టి.వి ఫీచర్‌కి జాతీయస్థాయి అవార్డు రావటం. ఒక మినియేచర్ పెయింటింగ్‌లా; టైమ్‌మిషన్‌లోకి వెళ్లి, పదో, ఇరవయ్యో సంవత్సరాలనాటి కబుర్లను, మనుషుల్ని, సంఘటనల్ని గుర్తు చేసుకుంటూ ఉండగా,



"ఇక చాలు, ఎనఫ్ ఈజ్ ఎనఫ్, విడిపోదాం, ఐ నీడ్ డివోర్స్," అని, హిస్టరికల్‌గా అరిచే తన భార్య గురించిన కబుర్లు ఆనంద్ మొదలుపెట్టాక, మొత్తం సన్నివేశం మారిపోయింది.

సరయు తన పదిహేనేళ్ల కొడుకు గురించి చెప్తుంది. వాడికదేదో సిండ్రోమ్ అని చెబుతుంది. హఠాత్తుగా తలను గోడకు టప్ టప్‌మని కొట్టుకుంటూ, పెద్దగా అరుస్తూ, ఎక్కడ నుంచి నేర్చుకున్నాడో తెలియదుగానీ, కర్ణకఠోరమైన బూతులతో వాళ్ల నాన్నని తిడుతూ ఉంటాడని. సందర్భం మారింది. మధురమైన సంగతులు. నాస్టాల్జియాలు ఏమీలేనట్లుగా; రోదనో, ఆక్రోశమో మాత్రమే మిగిలినట్లుగా.

విస్కీ బాటిళ్లు, సోడా, నీళ్లు తెచ్చి టేబుల్ పై పెట్టారు. మళ్లీ కబుర్ల వర్షం, మాటలు, అరుపులు, ఎగ్జైట్మెంట్; సత్యమూర్తి పొడవాటి చుట్టను వెలిగించాడు. కరుణాకరు తన రియల్ ఎస్టేట్ ఎడ్వెంచర్లు మొదలుపెట్టాడు. పవన్, టి.వి. యాంకర్ల భాషను అనుకరిస్తూ జోకులు చెబుతున్నాడు.

రచయిత శివసుందరం గురించి చర్చ మొదలైంది. శివసుందరం ఒక మూల కుర్చీపై, శప్తయోగిలా, గంభీరంగా, దుఃఖంగా, నిర్వేదంగా కూర్చున్నాడు; తెలుగునాట సుప్రసిద్ధుడైన నవలా రచయిత. ఆరు నవలలు, ఏడెనిమిది కథాసంపుటాలు; చరిత్రను తవ్వి, కథలన్నిటికీ ఆధునిక రూపాన్నిచ్చే రచనలు ఆయనవి. సరిగ్గా నెల క్రితం, ఆయన నవలలపై ఒక విమర్శ వచ్చింది. ఆయన రచనలు యాంటి గాడ్ అని; సంస్కృతికి వ్యతిరేకమని, ఔట్రేజియస్ అని. మరుసటి వారం వేల సంఖ్యలో కరపత్రాలు వెలిశాయి. ఆయన రచనల్ని నిషేధించాలని ఊరేగింపు; సోషల్ మీడియాలో హేట్ మెయిల్స్; ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యాలు సేకరించబడ్డాయి. హర్తాళ్లు, బంద్‌ల మధ్య కులప్రస్తావన వచ్చింది. ఆయన రచనల వలన కులం ఆత్మ గాయపడిందని; ఆయన్ను నిషేధించాలని. శివ

సుందరం గొంతు విప్పాడు. టైమ్‌మిషన్‌లోకి వెళ్లి యాభై యేళ్లనాటి సంగతులు గుర్తుచేసుకున్నాడు. అతని తండ్రిని, తండ్రి తండ్రిని; దుర్భరమైన బాల్యాన్ని, ఒక కులహింసని; మొదటి నవల రాసిన కాలాన్ని; నవల రాసే వేళ తను అనుభవించే సృజనాత్మకమైన వేదనని; ఇటీవల నవల గురించి. ఖాళీ చూపులతో; చాలాసేపు అందరం ఒక సామూహిక నిశ్శబ్దంగా మారిపోయాము.

రూమ్‌లో, ఆయన గొంతే మెల్లగా, మృదువుగా, దుఃఖాన్ని, వచనంలో రిసైట్ చేస్తున్నట్లుగా!

శివసుందరం లేచి నిలబడి, సంచిలోంచి తన నవలను బయటకు తీసి, నవలలోని చివరి అధ్యాయాన్ని చదివాడు. చరిత్ర తలుపులు తెరుచుకుని, ఎన్నో పాత్రలు మా ముందుకు వచ్చినట్లు; అందరం విస్మయంగా, అనిమేషంగా.

ఆయన నవల చదవటం ఆపివేసి, "ఈ విధ్వంసాన్ని, వేటాడటాన్ని ఇక తట్టుకోలేను. ఏవైపు నుంచీ సాయం రావటంలేదు. సాటి రచయితలు, పొలిటికల్ పార్టీలు ఎవరూ నన్ను సమర్థించి మాట్లాడలేదు. నా జీవితంలో ఉద్రూతలూగించే సందర్భాలన్నీ ఆగిపోయాయి; కాలాన్ని ఇక్కడ ఆపివేసి; ఇక్కడే నాలోని రచయితకు ఉరి వేస్తున్నాను. శివసుందరం అనే రచయిత మరణించాడు," అంటూ నవలను నేలపై విసిరి, సంచిలోని మిగిలిన నవలలన్నిటినీ నేలపై విసిరి, వాటిపై విస్కీ పోసి, మేము వారించేలోపే వాటికి నిప్పు పెట్టాడు. హాలంతా ఒక నిశ్శబ్దం. నల్లటి నుసి ఏదో ఇల్లంతా ఎగిసి; ఆ తగలబడటం ముగియనట్లు; అదృశ్యంగా ఇంకా, మా మధ్యన కొనసాగుతున్నట్లుగా-

* * *

ఏళ్ల క్రితం ఎప్పుడో కవిగా జీవితం మొదలుపెట్టాను. యూనివర్సిటీ రోజులవి. నోట్‌బుక్‌లో రాసుకున్న కవితలు, చిన్న సమూహాల

ముందు భయం భయంగా రిసైట్ చేసేవాణ్ణి. ఆ సమూహంలో లలిత కూడా ఉండేది. సోవియట్ సాహిత్యం మా పాషన్. చెహోవ్, దోస్తోవ్ స్కీలు నాకిష్టం. లలిత ఎప్పుడూ ఒక గోర్కీ పుస్తకంతో ప్రత్యక్ష మయ్యేది. లలితను మేము ఇష్టంగా 'నటాషా' అని పిలుచుకునే వాళ్లం. లోపలెక్కడో కవిత్వం చిన్న గూడులో కూర్చుని, గువ్వపిట్టలా కిచకిచమనేది. అదెప్పుడూ రెక్కవిప్పి ఎగరనే లేదు. కాలమిస్టుగా, సబ్ ఎడిటర్‌లా, అనువాదకుడిగా రకరకాల అవతారాలెత్తి, కొన్నాళ్లు యాడ్ ఏజన్సీలో చేరాను. లక్స్ సబ్బులు, పాండ్స్ పౌడర్ల యాడ్‌లను తెలుగులోకి అనువాదం. 'అంత కవిత్వమా, జనానికి అర్థం కావద్దూ' అని విసుక్కునే మేనేజర్. చాన్నాళ్లు, రియల్ ఎస్టేట్ వాళ్ల బ్రోచర్లు తయారుచేసే పని. డాక్యుమెంటరీలు, చిన్న ఏనిమేషన్ల తరువాత; చిన్న చిన్న యాడ్ ఫిలింలతో మొదలుపెట్టి, బొంబాయి వాడితో కలిసి, యాడ్ మేకర్‌గా పనిచేశాను. చివరకు ఇలా టీవీల్లో చేరి; గంట గంటకూ టీ, రెండు రోజులకొకసారి పారడైజ్ బిరియానీ, రిలాక్స్‌డ్‌గా పనిచేస్తున్నట్లు ఉంటాముగానీ, ఎవడో పై నుంచి దారా లేవో కట్టి, మా కదలికలన్నీ వాడే నడుపుతున్నట్లుగా- 'సర్కస్‌లో బఫూన్లం, ప్రొప్రయిటర్‌గాడి వేశ్యలం,' అంటాడు రమణకుమార్, న్యూస్ ఎడిటర్.

రిసార్ట్స్ పైన తీసిన ఫీచర్‌కు వచ్చిన అవార్డుతో హఠాత్తుగా నేనో విలువైన ఉద్యోగినయ్యాను. లంచ్ టైమ్‌లో ఒక అమ్మాయి, టిపికల్ మెట్రో ఇంటలెక్చువల్ గెటప్‌లో ఆఫీసుకొచ్చింది. ఐలమ్మ హాల్లో తన పెయింటింగ్స్ ఎగ్జిబిషన్ రమ్మని అహ్వానించింది. లంచ్ టైమ్‌లో బయటకు వెళ్లడానికి ఇదో సాకు. పాత మారుతీ 800 కారులో బయట పడ్డాను. తోవలో ఒక దృశ్యం. మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలు కొంతమంది టాంక్ బండ్ పై కనబడ్డారు గుంపుగా; వాళ్ల వెనుక అనాసక్తంగా ఉన్న గైడ్. ఒక్కొక్క విగ్రహాన్ని ముట్టుకుని; దానికేమైనా ఫీలింగ్స్

ఉంటాయా అన్నట్లుగా; కూలిపోయిన ఒక విగ్రహం దగ్గర, వాళ్లలో ఒక నలుగురు ఆ విగ్రహాన్ని ఓదార్చుతున్నట్లుగా, విరిగిపోయిన విగ్రహపు తలను నిమురుతూ, చెక్కిళ్లను చేతులతో ముట్టుకుని. కారు ఆపి వాళ్ల మధ్యన కూర్చుని, ఆ నలుగురు, విరిగిన విగ్రహం, నేను కలిసి ఒక 'సెల్ఫీ' ఫోటోను తీసుకుని; ఆ రోజు నేనా అమ్మాయి పెయింటింగ్ షోకి వెళ్లనేలేదు. ఆ విరిగిన విగ్రహాల మధ్యనే సాయంకాలం దాకా గడిపాను.

అదంతా ఒక మెటాఫర్‌లా, థీమ్‌లా, చిన్న చిన్న శకలాలుగా, అక్కడ ఇక్కడ పడి ఉన్న దృశ్యాలన్నీ ఒకచోట చేర్చి; ఇది నీ ముఖం... ఇది నా దు:ఖం... ఇది నీ మరణం... ఇదిగో ఇది ఇట్లా మొదలయింది అంటూ ఎనలైజ్ చేద్దామని, ఉదయాన్నే కూర్చుని, జెన్ బుద్ధిస్టుల మాస్క్ ఒకటి ముఖానికి తగిలించుకొని లలిత ఇచ్చిన కాఫీతో ఇరవైయేళ్లు వెనక్కివెళ్లిపోయి...

హఠాత్తుగా ఫోన్ మోగింది. ఫోన్‌లోంచి ఒక మరణం పెడేల్మని నన్ను తాకింది; ఫోన్లో రచయిత, నా స్నేహితురాలు రాగిణి గొంతు పీలగా ఉంది. వెంకటేశ్వరరావు చనిపోయాడని వణుకుతున్న గొంతుతో చెప్పింది. ఒక చాప్టర్ ముగిసిపోయింది.

"... కానీ శేఖరం, ఒట్టి చావైతే ఏడ్చేదాన్ని, మొత్తుకునేదాన్ని, పోయి కూడా నన్ను సాధించడం మొదలుపెట్టాడు. ఆయన చనిపోయి గంటలు కాలేదు. ఆయన్ను నేనే చంపానంటూ ప్రచారం మొదలైంది."

స్పీకర్ ఫోన్ అది. రాగిణి గొంతు వినబడుతుంది. లలిత నిర్లిప్తంగా వింటుంది. వాళ్లిద్దరి పెళ్లి మేమే చేసింది. పెళ్లి చేసుకోబోయే ఇద్దరూ విడోలే. ఆ పెళ్లి ఇద్దరికీ ఒక అవసరం. రాగిణికి పోషించే మనిషి కావాలి. వెంకటేశ్వరరావుకు ఇంట్లో పడి వుండే మనిషి కావాలి. రాగిణి సన్నటి ఎక్కిళ్ల మధ్య నుంచి మాట్లాడుతూనే వుంది-

"జీవితమంతా దుఃఖమే. ఇరవైయేళ్ల క్రితం అదృశ్యమైన మనిషి దుఃఖం మిగిల్చాడు. ఇదిగో, ఈ మనిషీ అంతే. భార్యగా ఎప్పుడూ చూడలేదు. నర్సుగానే ఉచ్చలు తుడిసి, ముడ్డి కడిగి. కొడుకు కష్టాల్లో ఉన్నాడని అడిగితే, 'నిన్ను చేసుకున్నాను కాబట్టే నిన్ను పోషిస్తాను, నీ కొడుకు బాధ్యత నేనెందుకు మొయ్యాలి,' అంటూ అరిచేవాడు. కడుపునిండా దుఃఖాన్ని పెట్టుకుని బ్రతికాను. ఇదిగో ఇప్పుడీ నింద."

ఫోన్ నిండా ఆమె రోదన. క్లిక్ మంటూ ఫోన్ పెట్టేసిన చప్పుడు. లలితవైపు చూశాను. లలిత ముఖంలోని ఫీలింగ్స్ నేను పోలిక పెట్ట లేకపోయాను. పశ్చత్తాపమో, విసుగో, మరింకే ఉద్వేగమో; నా ముఖం పైని జెన్ మాస్క్‌ని విప్పేను. నా కళ్ల ముందు సరీసృపాలు, ఎలుగు గొడ్లు, అడవిదున్నలు; ఒక అరణ్యం ప్రత్యక్షమైనాయి.

"నీ లాయర్ ఫ్రెండ్‌తో ఒక మాట చెప్పించి ఉంచు; పోలీసుల తోనూ లాబీయింగ్ చెయ్యవలసి వస్తుందేమో," ఒక ప్రకటన చేసి లలిత బయటకు వెళ్లింది. బయట అవిరామంగా గంటలు మోగు తున్నాయి. రైలు కూత ఒకటి, చెవుల్లో కేకలు పెడుతూ వెళుతుంది.

గ్రానైట్ కింగ్ వెంకటేశ్వరరావు ఒక నమూనా. వ్యాపారం తెలిసిన వాడు. కోట్లు సంపాదించాడు; కానీ ఈ రోజున రాగిజావ, ఉడకబెట్టిన కూరగాయలు, బార్లీ నీళ్లు, నాలుగేళ్లుగా ఇదే అతని ఆహారం. రీనల్ ప్రాబ్లమ్, వారానికొకసారి డయాలిసిస్ చేయాలి; అదీ అతని పరిస్థితి.

వెంకటేశ్వరరావు ముఖం ఎప్పుడూ రిలాక్స్ గా ఉండేది. జబ్బు గురించిన భయం లేదు. పుగాకు, పత్తి పొలాల మీదుగా గ్రానైట్ వ్యాపారంలోకి వచ్చాడు. మాజీ కమ్యూనిస్ట్‌గా చెప్పుకుంటాడు. మొదటి పెళ్లి పార్టీ చేసిన పెళ్లి; ఆవిడిప్పుడు లేదు. ఆమె గురించి ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. వెంకటేశ్వరరావుకు పాతికేళ్ల కూతురు, ఆయనతో పోట్లాడి ఇల్లు విడిచి వెళ్లింది. బోతిక్ నడుపుతుంది. షార్ట్ ఫిల్మ్‌లు తీస్తుంది. (సహజ ఆమె పేరు). 'పుస్తకాలంటే నాకు ప్రాణం,'

అంటాడు వెంకటేశ్వరరావు. చార్లెస్ డికెన్స్, మార్క్ ట్వైన్ నా అభిమాన రచయితలంటాడు. రెండవ భార్య రాగిణి గురించి- సంస్కర్త హృదయంతోనే ఆమెను చేసుకున్నానని అంటాడు; రాగిణి, వెంకటేశ్వరరావు జీవిత చరిత్రను 'ఎగిసిన కెరటం' పేరుతో నవలగా రాసింది.

వెంకటేశ్వరరావు కూతురు సహజకి తండ్రంటే ద్వేషం. ఒక అపార్ట్‌మెంట్‌లో ఒకవైపు బోటిక్, ఇంకొకవైపు బ్యూటీ పార్లర్ నడుపుతుంది. ఆ అమ్మాయి చాలా ఫ్రీగా మాట్లాడుతుంది. తన కోరికల గురించి, ఇష్టాల గురించి మాట్లాడేది. తండ్రిని, అతని స్త్రీలను చూసినాక పెళ్లి అనే వ్యవస్థ మీద విరక్తి కలిగిందని చెప్పింది. మంచి జ్ఞాపకాలేమైనా ఉంటే అవి తల్లితోనేనని, ఆమె వెళ్లిపోయాక అంతా దుఃఖమేనని చెప్పింది. ఒక లివ్-ఇన్-రిలేషన్ గురించి, ఆ రిలేషన్ నుంచి విడిపోయిన సంగతి, ఒక అబార్షన్ గురించి నిర్భయంగా చెప్పేది. చివరిసారి కలిసినప్పుడు ఆ అమ్మాయి చెప్పిన మాటలెందుకో నన్ను కలిచివేశాయి. "తండ్రిని ఒక రోల్ మోడల్ అనుకుంటాము కదా, కుటుంబ ప్రేమ, అందమైన జ్ఞాపకాలు కదా, నాన్న అంతమంది స్త్రీలను ప్రేమించానడం నాకు ఆశ్చర్యం. అమ్మ వెళ్లిపోయాక, ఇల్లంటే అసహ్యం వేసేది. ఇల్లంతా డబ్బు వాసన వేసేది లేదా పిన్ని కన్నీళ్ల వాసన వేసేది. విషపు సూదిమందేదయినా ఇచ్చి ఆ మనిషిని చంపేయకూడదా అనేదాన్ని పిన్నితో. ఆ మనిషి చనిపోయినాకే మళ్లా ఆ ఇంటికొస్తానని చెప్పాను," అనేది.

వెంకటేశ్వరరావు అంతిమయాత్ర నుంచి నేరుగా మరో జర్నలిస్టు మిత్రుడు కల్లూరి రాజ సంస్మరణ సభకు వెళ్లాల్సి వచ్చింది. 'ఒక రోజే ఇన్ని చావుమేళాలా, నేను రాను,' అంటూ ఇంటికి వెళ్లిపోయింది లలిత. రాజు ప్రముఖ కవి, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త. తన కవితల్లో, పాటల్లో 'ఫోర్స్ ఆఫ్ రిథమ్' ఉంటుందని చెప్పేవాడు. రాజు నేపథ్యం నాకు సరిగ్గా తెలియదు. బహుశా పల్లెల నుంచి వచ్చి

ఉంటాడు. దళిత, గిరిజన నేపథ్యం అతనిది. మొదటిసారి అతని కవితా సంకలనం ఆవిష్కరణ సభలో కలిశాను. భుజంపై చెయ్యివేసి, మనిషిని దగ్గరగా తీసుకున్నట్లుగా ఉంటాయి అతని కవితలు. లాంగ్ పోయిమ్స్‌లా ఉంటాయి అతని కవితలు. అద్భుతమైన పెయింటింగ్స్ లా ఉంటాయి.

'శివసాగర్ నా స్ఫూర్తి. నా కవిత్వం సముద్రపు హోరు, అడవి లోపలి దావానలం,' అనేవాడు చాలాసార్లు. "గురువుగారూ! అట్లా కాఫీ హోటల్ కు వెళ్లి వద్దామా,' అంటూ బయటకు తీసుకువెళ్లేవాడు. అతనితో మాట్లాడుతుంటే, పల్లెల వాసన వేసినట్లుండేది. 'నేనో పురాతనమైన మనిషిని,' అనేవాడు. పల్లెల్లో పాడే పాటలు ఆశువుగా పాడేవాడు. 'ఈ సిటీ మృత్యుశాల, మనుషుల్ని బలి కోరుతుంది,' అనేవాడు. 'మా యమ్మ ఇక్కడే చనిపోయింది. పదేళ్లు మందులు వాడాను. అంతుపట్టని జబ్బు. నా తమ్ముడు ఉద్యోగం కోసం వచ్చి ఈ రోడ్డుపైనే యాక్సిడెంటయిపోయాడు. ఏదో ఒక రోజు నేనూ, నా కుటుంబం కూడా, మాన్-ఈటర్ సార్ ఈ సిటీ,' అనేవాడు. కనబడని దిగులు, భయం అతని మాటల్లో. అతని కవిత్వం మాత్రం ఉద్రూత లూగించేది. శక్తివంతమైన ప్రతీకలు; పదేళ్లలో నాలుగు సంకలనాలు వేశాడు. ఏడెనిమిది దాకా అవార్డులు వచ్చాయి.

రాజు పరిచయమైన రోజుల్లో, నా సుప్త ప్రపంచంలో అలజడి రేగిన కాలం అది, నా రాత్రులన్నీ కలలు, కలలుగా మరణ వాసన వేసేవి. నిద్ర లేకుండా గడిపిన కాలం అది. సుదీర్ఘమైన కలలు-హింసాత్మకంగా, రంగురంగుల మరణంలా ఉండేవి. ఆ కలల నుంచి మేల్కొన్నాక శక్తులన్నీ ఎవరో పీల్చేసినట్లుగా ఉండేది. చాలాసార్లు నా కలల్లో రాజు వచ్చేవాడు. వందలమంది కత్తులతో అతన్ని వేటాడుతున్నట్లు, అతని శిరస్సు తెగి నా చేతుల్లో పడినట్లు. ఇంటికొకసారి తీసుకెళ్లాడు. 'నా భార్య, నన్ను ఆవహించిన మంత్ర మహిమ, నా

దేవత,' అని పరిచయం చేశాడు. సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్. ఇల్లంతా మినియేచర్ అడవిలా ఉంది. దుప్పికొమ్ములు, పల్చటి దరువు, మట్టిబొమ్మలు. 'నేను అడవి దేవతల్ని, మంత్రవిద్యల్ని ఆవాహన చేసేవాణ్ణి, ఆత్మలతో మాట్లాడటం తెలిసినవాణ్ణి, కనికట్టు విద్యలు వచ్చు నాకు,' అనేవాడు. అతని భార్య అమాయకురాలు. పల్లెటూరి దేవతలా ఉండేది. గిరిజన కార్పొరేషన్‌లో చిన్న ఉద్యోగం. ఆమె ఎదురుగా ఉన్నప్పుడు రాజులోని కవి విశ్వరూపం చూపేవాడు. ఉరుములు, మెరుపులు, ఆకాశం చీలిపోవటం, ఎరుపురంగు కలలు, సమాధులు చీల్చుకుని, గతకాలం ముందుకు రావటం, డప్పులు, కొమ్ముబూరలతో ఒక యుద్ధనాదం అతని కవితల్లో కనబడేది.

సరిగ్గా ఏడు రోజుల క్రితం, రాజు, సిటీలో అత్యంత ఎత్తైన భవనం (బంజారాహిల్స్‌లో ఉంది) పైకి ఎక్కి, అక్కడ నుంచి రెండు చేతులు విశాలంగా శిలువపై క్రీస్తులా సాచి గాల్లోకి దూకేశాడు. భార్యకు రెండు వాక్యాల ఉత్తరం రాసి జేబులో పెట్టుకున్నాడు. 'క్షమించు, సెలవు' అంటూ.

రాజు సంస్మరణ చాలా పెద్ద ఎత్తున జరిగింది. సిటీలోని ప్రముఖులు (రచయితలు, కవులు, కళాకారులు) వచ్చారు. ఒక్కొక్కరూ, రాజుతో వాళ్ల జ్ఞాపకాల్ని చెబుతున్నారు. అతని పుస్తకాలన్నీ మళ్లీ ప్రచురించాలని, భార్యకు పర్సు ప్రజెంట్ చెయ్యాలని; ఆ అమ్మాయి ఏడ్వడానికి శక్తి లేదన్నట్లు సొమ్మసిల్లిపోయి ఉంది. మీటింగ్ అయిపోయినాక, ఆ అమ్మాయి మా పక్కన కూర్చుని (రేణుకాదేవి ఆమె పేరు)... బలవంతం మీద టీ తాగుతూ-

"చాలా సార్లు అనేవాడు చచ్చిపోవాలనుందని, బ్రతికడమంటే హింస అనే వారు. ఇంత పెద్ద సిటీలో మనం అనాథలం, ఎవరికీ అవసరం లేని వాళ్లం అనేవారు. ఎటువైపు నుంచి ఆశ లేదు అనే వాడు. ఒకసారి ఒక పాముపిల్లని గాజుసీసాలో పెట్టుకుని తెచ్చాడు.

బయటకు తీసి, చపాతీ కర్రతో పొడిచి, పొడిచి చంపాడు. 'ఇది... వీడు మా బాస్, కులం పేరుతో నన్ను ఎగతాళి చేసినవాళ్లు, ఇది మనం బ్రతికే సిటీ; దీన్ని ఇంటి బయట పాతిపెడతాను. రాత్రికి ప్రశాంతంగా నిద్రపోదాము...' అనేవాడు. నాకు భయం వేసేది."

ఆమె చుట్టూ పదిమందిదాకా కూర్చున్నాము. అందరం, ఒక్కొక్క జ్ఞాపకాన్ని చెప్పుకుంటూ, రాజు జీవితచరిత్రని వింటున్నట్లుగా; 'భగవంతుడికి, మనుషుల్ని రక్షించే శక్తులు పోయాయి అన్నారెవరో.'

నేను ఉలిక్కిపడ్డాను. 'ఇదొక సంక్షుభిత కాలం బ్రతికుండటమే గొప్ప ఎచీవ్ మెంట్,' ఇదివరకెవరో అన్నారు. ఆ సాయంత్రం అందరం కలిసి రాజు ఇంటికి వెళ్లాము. తలా పదివేలు వేసుకుని ఒక లక్ష రూపాయల కవర్ని టేబుల్‌పై పెట్టాము. నేను రాజు ఇంటి నుంచి మట్టిబొమ్మను అతని జ్ఞాపకంగా తెచ్చుకున్నాను. సాగిలపడి, ఆకాశం వైపు చేతులు సాచి ప్రార్థిస్తున్న అడవిమనిషి బొమ్మ అది.

* * *

ఆదివారం సాయంత్రం, అవార్డు ఫంక్షన్. రవీంద్రభారతిలో అవార్డు ప్రకటించినప్పుడున్న ఉత్సాహం, థ్రిల్ ఇప్పుడు లేవు. మధ్యాహ్నం రెండు గంటలకే ఇంటి నుంచి బయల్దేరా. ప్రత్యేకమైన డిజైనర్ డ్రస్సు, లాల్చీ, కుర్తా, భుజం చుట్టూ శాలువా. వీధులన్నీ చూసుకుంటూ, వాహనాల రొద, మనుషుల మాటలు, ఎత్తైన బిల్డింగ్‌ల నిశ్శబ్దం; కారును ఆపి, పేవ్ మెంటు పైన నడుచుకుంటూ-

లేత ఎండ, శీతాకాలపు చల్లటిగాలి, నా కాళ్ల కింద ఎండిన ఆకుల చప్పుడు, చిరపరిచితమైన ఈ రహదారులు నాతో సంభాషిస్తున్నట్లుగా; హఠాత్తుగా ఒక గాలితెర, నన్ను చుట్టుముట్టి; దృశ్యాలను తొక్కుకుంటూ ముందుకు వెళ్తుతుంటే, మనుషులందరూ వెనక్కు, సెపియారంగు గతంలోకి అదృశ్యం అవుతూ; బేల్ పూరీ,

పానీపూరీ అమ్మే బీహారీ, అక్కడే ఇరవైయేళ్లుగా నిలబడి 'బేల్ బేల్' అని అరుస్తున్నట్లుగా;

ఈ వీధుల్లోనే నేను జీవించాను. ఉస్మానియాలో ఎమ్.ఏ, ఈనాడు జర్నలిజం స్కూల్‌లో ఒక సంవత్సరం, ఒక పత్రిక నుంచి మరో పత్రికకు జంప్ చేస్తూ; స్ట్రెస్, జీవితం అంటే, మనుషుల మంచి తనం అంటే అపనమ్మకం, ప్రతిదాన్నీ సందేహించటం; జీవితమనే భీకరమైన సింహం ముందు సాగిలపడిన రోజులు. ముప్ఫైయేళ్ల క్రితం, చిన్న చిన్న కవితలు జేబులో పెట్టుకుని, వార్తలో, వ్యాసాలో రాసిన వాటి పేపర్ కటింగ్స్ వెంటబెట్టుకుని, ఎవరైనా కాస్త మెచ్చుకుంటారేమోనని ఎదురుచూస్తూ-

రవీంద్రభారతి ముందు ఎవరూ నాకోసం ఎదురుచూడడం లేదు. లోపలా ఎవడూ ప్రత్యేకంగా పలకరించలేదు. మధ్యలో ఎప్పుడో నా పేరు చదివారు. ప్రముఖ ఇంగ్లీషు పత్రిక సంపాదకుడెవరో బహుమతి ఇచ్చారు. రాసుకొచ్చిన రెండు పేజీలను చదివాను. ఆత్మ కథలో పేజీలా ఉందది. వాళ్లు విన్నారోలేదో తెలియదు. సభ లోంచి కొన్ని గాఢమైన నిట్టూర్పులు మాత్రం వినబడ్డాయి. సభ ముగిసినట్లే ఉంది. నలుగురైదుగురు కుర్రవాళ్లు చుట్టూ మూగారు. అభి నందనలు, షేక్‌హాండ్‌లు. దూరంగా వాసుదేవరావు. నేను పని చేసిన తొలి ఎడిటర్, సౌమ్యుడు, తండ్రిలాంటివాడు. అతనిక్కడ ఉండటం బాగుంది. 'సార్ నమస్తే,' అంటూ ఆయన దగ్గరకు వెళ్లాను. ఆయన నా వైపు అపరిచితంగా, గుర్తుపట్టినట్లుగా చూశాడు. నేను తొలిరోజుల నాటి జ్ఞాపకాలు గుర్తుచేయబోయాను. ఆయన నావైపు కొత్తగా చూస్తూ, 'నాన్నగారు చనిపోయి ఐదేళ్లవుతుంది. నేను వాళ్లబ్బాయిని. సదాశివని,' అన్నాడు. నేను చనిపోయి ఐదేళ్లవుతుందని వాసుదేవరావు గారు అన్నట్లుగా అనిపించింది. అతని చెప్పేదానిని వినిపించుకో కుండా అక్కడ నుంచి నడిచి వచ్చాను.

షేవ్‌మెంటు పై బరువుగా నడుస్తున్నాను. మెమెంటో, శాలువా బరువుగా అనిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి బ్రహ్మాండమైన వెలుగు, ఎటు చూసినా మానవ సమూహాలు. వాళ్లందరూ నన్ను రాసుకుంటూ, నా నుంచే వెళుతున్నట్లుగా; రాత్రి  పదకొండు దాటింది. నడుస్తూ ఉండే నా పాదాల కింద గత సంవత్సరాలన్నీ; నిర్జీవమైన శరీరాల్ని తొక్కుకుంటూ వెళ్లుతున్నట్లు; దగ్గరలో ఉన్న బార్‌కు వెళ్లాను.

చనిపోయిన నాన్న నా కెదురుగా టేబుల్ పై కూర్చుని- 'అకాల మరణం నాకెందుకు, నలభై యేడేళ్లేమీ పెద్ద వయసేంకాదు కదా, మరెందుకుకిలా, హాస్పిటల్‌లో చేర్చి, డబ్బులు ఖర్చుపెట్టి ఉంటే నేను బ్రతికేవాణ్ణి కదా,' అని అడుగుతున్నాడు. ఆయన వెనకనే అమ్మ- 'ఒట్టి వెధవ్వి, బ్రతకటం చేతకానివాడవి,' అంటుంది కోపంగా; ఎప్పుడో లలిత కూడా వచ్చినట్లుంది; లలిత- 'మూడు భ్రూణాలు, కడుపులోనే చనిపోయిన మూడు శవాల్ని నాకిచ్చావు,' అంటుంది, కోపమో, దుఃఖమో తెలియనట్లుగా-

రెండు, మూడు పెగ్గుల తరువాత కానీ, నా ఎదురుగా కూర్చున్న మనుషులు అదృశ్యం కాలేదు. పన్నెండు దాటింది. బార్‌కు ఒకవైపు షట్టర్స్ వేశారు. లోపల పదిమంది కూడా లేరు. ఒక మూల నుంచి, ఒక ఆడమనిషి, పాటలాంటిదేదో హమ్ చేస్తుంది. ఉర్దూ పాట. ఘజల్ లాంటిది. చాలా దుఃఖంతో పాడుతుంది. అది తాగుబోతు ప్రేలాపన లా ఉందిగానీ, కమ్మటి పాటలాగా కూడా ఉంది. లేచి వెళ్లి, ఆమె టేబుల్ దగ్గర నిలబడి; ఆమె తల పైకెత్తి, ముఖం చుట్టూ ఉన్న ముంగురుల్ని వెనక్కుతోసి, 'నాపేరు లలిత, లలితం'టూ షేక్ హేండ్ కోసం చెయ్యి ముందుకు సాచింది. 'లలితా, నువ్వా ఇక్కడా,' అంటూ అంతా పరిచితంలా, అపరిచితంలా!

కారు స్టార్ట్ చేసి ఇంటికి బయలుదేరాను. సన్నటి మంచు దుప్పటి కప్పుకున్నాయి రోడ్లు. స్ట్రీట్ లైటు బ్రహ్మాండమైన వెలుగులే

కానీ, ఎవరో భీకరంగా ఏడుస్తున్నట్లుగా ఉంది. షేవ్‌మెంటుపై నడుస్తూ వెళుతూ ఒక ఆడమనిషి, కాదు, లలిత, కాదు ఒక భ్రమ.

ముప్ఫైయేళ్ల సాహచర్యం. యాభై యేళ్లు దాటాయి లలితకు, లోపలి ఫైర్ ఆగిపోయింది. దేన్నీ పట్టించుకోదు. మూడు అబార్షన్ల తర్వాత ఒక ఆడపిల్ల. మెదడు సరిగా పెరగని పిల్ల. ఇంట్లో ఉన్నంత సేపూ దానితోనే గడుపుతుంది. అది నిద్రపోయాక, దాని పక్కన పడుకుని, నిద్రపోకుండా అట్లా కళ్లు తెరుచుకుని చూస్తుంది. 'నిద్ర పోవాలంటే భయం, నిద్రపోతే కలలు వస్తాయి. ఆ కలల్లో పిల్ల చచ్చి పోతుంది. నువ్వు చచ్చిపోతావు, అందుకే నిద్రపోకుండా ఇలా మేలుకున్నా,' అంటుంది.

కారు వెళుతూనే ఉంది. నా వయసు ఇప్పుడు యాభై ఆరు. అవసరాన్ని మించి ఎక్కువ కాలం జీవించాననిపిస్తుంది. వెనక్కి తిరిగి చూసుకునే ఆ కాసిన్ని జ్ఞాపకాలు తప్ప, ముందు ముందు మరింకే అద్భుతాలు జరగవనిపిస్తుంది. మెమరీ లాస్ వచ్చింది. బహుశా ఆ కాసిని జ్ఞాపకాలూ అదృశ్యం అయిపోతాయేమో!

కారు ముందుకు వెళుతూనే ఉంది. తార్నాక రోడ్ నెం. 8 దాటాను. ఒక మనిషి రోడ్డు దాటుతున్నాడు. తాగి ఉన్నాడేమో, తూలుతూ నడుస్తున్నాడు. హఠాత్తుగా రోడ్డు మధ్యలో ఆగిపోయాడు. వేగంగా వస్తున్న కారును స్లో చేసి, అతని పక్క నుంచి వెళుతుండగా, అతను అటువైపు కదిలాడు. కారు బ్రేక్ వేశాను కానీ అతను తూలి కారు బోనేట్‌ను తగిలి, రోడ్ పై పడ్డాడు. సన్నటి మూలుగు. దగ్గరకు వెళ్లి, పైకి లేపాను. నుదుటిపై రక్తం, ఇప్పుడే తగిలిన దెబ్బ నుంచి; కర్చీఫ్‌ను ఆ రక్తానికి అడ్డుపెట్టి అతన్ని రోడ్డు పక్కకు, ఎదురుగా ఉన్న షెల్టరు దగ్గరకు తీసుకెళ్లి అతనివైపు దీక్షగా చూశాను. మాసిన గడ్డం, దువ్వని తల, చిరిగిన చొక్కా, అతని దగ్గర ఘాటైన నాటుసారా వాసన. బహుశా ఆ చుట్టుప్రక్కల కాలనీలోని మనిషయి ఉంటాడు.

పర్సులోంచి కొంత డబ్బు తీసి, అతని చేతిలో పెట్టి ఏదైనా ఆస్పత్రిలో చూయించుకోమన్నాను. అతను, తన చేతిలోని డబ్బువైపు చాలాసేపు చూసి, ఆ తరువాత నావైపు చూసి, చాలాసేపు నావైపు చూసినాక, హఠాత్తుగా, 'హరామ్ జాదే,' అంటూ నా గొంతు పట్టుకొని.... అతని చెయ్యి నా గొంతుపై నుంచి కిందకు జారి, నా చొక్కా పర్రున చిరిగి... అతను ఖాండ్రించి 'థూ' అంటూ నా ముఖంపై ఉమ్మి, అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక*
*మార్చి 2016*